మంచి కవితతో కొంచెం సేపు

విన్నకోట రవిశంకర్



# నల్లగేటు నందివర్ధనం చెట్టు

## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

జీవితోత్సవాన్ని దగ్గరగా చూపించటం కవిత్వం చేసే విశిష్టమైన పనుల్లో ఒకటి.ఎదగటం, పచ్చగా కళకళ లాడటం, పువ్వుల నవ్వుల్ని విరజిమ్మటం - వీటన్నిటితో నిండిన పూల మొక్కకంటే జీవన వైభవాన్ని ఆవిష్కరించటానికి అనువైన వస్తువేముంటుంది. అందుకే **శిఖామణి** నందివర్ధనం పూల మొక్క గురించి కళకళలాడే ఒక కవిత రాసాడు. ఈ కవితను ఇదే పేరుతో కొంతకాలం క్రితం వెలువడిన అతని కవితాసంకలనంలో చూడవచ్చు.

గోదావరి శర్మగారు ఒకసారి మాట్లాడుతూ, తన కవిత్వంలో సామాజిక స్పృహ కంటె, సాంసారిక స్పృహ ఎక్కువని చమత్కరించారు. శిఖామణి అనేక ఇతర స్పృహలున్న కవితలు చాలా రాసినప్పటికీ, ఈ కవితలో మాత్రం శర్మగారు చెప్పిన సాంసారిక స్పృహే ఎక్కువగా కనిపిస్తుంది. అసలు ఈ కవితలో అందమంతా ఒక పూల మొక్కను తమ చిన్న కుటుంబంలో భాగంగా భావించటంలోనే ఉంది. కవితలో వాడిన ప్రతీకలన్నీ ఇదే భావాన్ని సమర్థించే రీతిలో వాడబడటంవల్ల, కవిత మొత్తానికి ఒక రమ్యత చేకూరింది.

*పాతిన మూడు రోజులకే*
*పసి పిల్లాడు ఎత్తుకోమని చేతులు చాచినట్టు*
*కొమ్మల చేతులు పైకెత్తి నిగనిగలాడుతూ నవ్వింది.*
*ఆ రోజునుండీ మా యింట్లో పిల్లలు*
*ఇద్దరికి ముగ్గురయ్యారు.*

చిన్నారి మొక్క పసి పిల్లాడు ఎత్తుకోమని చేతులు చాచినట్టు ఉందనటం ఎంతో అందమైన ఊహ. కొన్ని పదచిత్రాలకు ఒక అంతిమత్వం ఉంటుంది. అంటే, దీనిని ఇంతకంటే బాగా చెప్పటం ఎప్పటికీ వీలుకాదనిపించటం. అటువంటి లక్షణం ఈ పదచిత్రానికుంది. చిక్కుడు లాంటి విత్తనాలు మొలకెత్తినపుడు, మొలక చివర విత్తనం కనిపిస్తుంది గదా. ఇటువంటి దాన్ని గురించి గుంటూరు శేషేంద్ర శర్మగారు ఒక కవితలో, అప్పుడే భూమి పైకి వచ్చిన మొలక కృతజ్ఞతతో చేతులు జోడిస్తుందని రాసారు. మొదటిసారి ఆ కవిత చదివినప్పుడు కలిగిన ఆనందంవంటిదే, మళ్ళీ శిఖామణి రాసిన ఈ వాక్యాలు చదివినప్పుడు నాకు కలిగింది.

ఎదిగే మొక్కను, మొదట తన పిల్లలతో, తరువాత తన పిల్లల తల్లితో, కవిత చివరలో తన తల్లితో పోల్చటంలో కూడా ఎంతో ఔచిత్యముంది.

*నిన్నటి దాకా*
*చెప్పిన మాటవినని మా ఆకతాయి*
*నందినిలాంటి నందివర్ధనం చెట్టు*
*ఇంతలోనే*
*నాలుగు కొమ్మల మెడలు సాచి*
*గుత్తులు గుత్తులుగా పూలు పూచి*
*పిల్లల  స్కూలు ఆటో గురించి ఆత్రంగా ఎదురుచూచే తల్లిలా*
*మాఇంటి నల్లగేటు మీద తల నించి ఎదురుచూస్తుంది.*

----

*నేనెరుగని*
*నా కన్నతల్లి*
*ఇప్పుడు మా ముంగిట్లో పచ్చని చెట్టై  వెలసి*
*ఆకుల కళ్ళతో*
*నా వొళ్ళంతా తనివి తీరా*
*నిమురుతున్నట్లే ఉంది.*
*రోజూ ఇన్ని పూలను*
*అక్షతలుగా రాల్చి*
*చల్లచల్లగా దీవిస్తున్నట్లే ఉంది.*

తను పుట్టినపుడే చనిపోయిన తల్లి ప్రస్తావన శిఖామణి అనేక కవితల్లో పునతావృతమౌతుంది. కొన్నిసార్లు ఈ భావన అతిగా వాడబడిందేమోనని నా కనిపించిన సందర్భాలు లేకపోలేదు గాని, ఈ కవితలో మాత్రం సముచితంగానే తోచింది. కవితలో ముందు వాడిన పదచిత్రాలకు కొనసాగింపుగా, ఒక ముగింపుగా కూడా బాగా నప్పింది.

ఈ మొక్కను మిత్రుడెవరో బహూకరించటంవల్ల, సాంసారిక బంధాలకే కాకుండా, స్నేహ బంధానికి కూడా అది ప్రతీకగా తీసుకోబడింది. అంతేకాదు, మొక్కను తనలో కవిత్వపు పత్రహరితం నింపే మిత్రునిగా కవి భావిస్తాడు.

*నాలో కవిత్వపు పత్రహరితం హరించుకుపోతున్నప్పుడల్లా*
*తన పచ్చదనాన్ని నాలోనూ కొంత వొంపి నన్ను కావ్య సంజీవిని చేసింది చెట్టు.*

మొక్కను కత్తిరించినట్టు అక్కడక్కడ ఈకవితను కొంత కత్తిరిస్తే మరింత అందంగా ఉండేదేమోనని నా కనిపిస్తుంది గాని, మొత్తం మీద ఇది చాలా మంచి కవిత. అంతేకాదు, ఇటువంటి కవితలు చదివినప్పుడు జీవితం మీద ఆశ కలుగుతుంది. ఆనందమన్నది తనకు లభించని వస్తువులో ఎక్కడో ఉందని భావించి, నిత్యం అసంతృప్తితో అలమటించే మనిషికి, పెరట్లో ఉన్న పూల మొక్కనుంచి కూడా ఎంత ఆనందం పొందవచ్చునో ఈ కవిత నిరూపిస్తుంది. చెట్లని నాటమంటూ ప్రబోధగీతాలు రాయనక్కర్లేదు. ఇటువంటి కవిత ఒకటి చదివితే చాలు. వెంటనే ఒక చిన్న పూల మొక్కను నాటి, కన్న కూతుర్ని పెంచినంత ప్రేమగా దానిని పెంచుకోవాలనిపిస్తుంది.

*కవిత పూర్తి పాఠం :*

---------------------

*రాజమండ్రి నుండి*
*రాజధానికి బదిలీ అయి వొస్తుంటే*
*ఆప్తమిత్రుడొకడు*
*ఆప్యాయంగా*
*వేలెడంత నందివర్ధనం మొక్కను బహూకరించాడు.*

*చెట్టు జ్ఞానానికి ప్రతీక అన్న సోదీ మహాకవి మాటల్ని*
*ఇంగితం గుర్తు చేస్తే*

భయపడుతూనే వెంట తెచ్చుకున్నాను.
నా అదృష్టంకొద్దీ కాంక్రీటు కీకారణ్యంలో
చారెడు మట్టిగల ఇల్లే దొరికింది.

ఇచ్చినవాడి అభిమాన బలమో
నాటిన మా ఆవిడ చేతిచలవో
లేక భూసారమో తెలియదు గానీ
పాతిన మూడు రోజులకే
పసి పిల్లాడు ఎత్తుకోమని చేతులు చాచినట్టు
కొమ్మల చేతులు పైకెత్తి నిగనిగలాడుతూ నవ్వింది.
ఆ రోజునుండీ  మా యింట్లో పిల్లలు
ఇద్దరికి ముగ్గురయ్యారు.
మీగాళ్ళమీద కూచుని పాదుచేసిన మొక్క
మోకాళ్ళ మీద వొంగుని నీళ్ళుపోసిన మొక్క
చూస్తుండగానే చేయెత్తు చెట్టయింది.
తోకల్లేని మా రెండు కోతులకు
ఉయ్యాలా జంపాలా అయింది.

నిన్నటి దాకా
చెప్పిన మాటవినని మా ఆకతాయి
నందినిలాంటి నందివర్ధనం చెట్టు
ఇంతలోనే
నాలుగు కొమ్మల మెడలు సాచి
గుత్తులు గుత్తులుగా పూలు పూచి
పిల్ల స్కూలు ఆటో గురించి ఆత్రంగా ఎదురుచూచే తల్లిలా
మాఇంటి నల్లగేటు మీద తల ఆనించి ఎదురుచూస్తుంది.
భూమి లోతుల్లోకి పాకిన దాని వేళ్ళు
బహుశా అంతరంగంలో

మా వూరి మట్టిని పలకరించే ఉంటాయి.

నాలో కవిత్వపు పత్రహరితం హరించుకుపోతున్నప్పుడల్లా

తన పచ్చ దనాన్ని నాలోనూ కొంత వొంపి నన్ను కావ్య సంజీవిని చేసింది చెట్టు.

వీధి అన్ని గేట్లూ

కుక్కలున్నాయి జాగ్రత్త అని మెడలో బోర్డులు తగిలించుకుంటే

మా నల్లగేటుమాత్రం

పూలమొక్కలున్నాయి జాగ్రత్త అని హెచ్చరిస్తుంది.

వీధిలో ప్రహరీగోడలన్నీ

గాజుపెంకుల గొగ్గిపళ్ళను బయటపెట్టి భయపెడుతుంటే

మా గోడ మాత్రం నందివర్ధనం పూల నవ్వులతో స్వాగతిస్తుంది.

అన్ని గడపలూ పండగకో పబ్బానికో

నాలుగు పచ్చనాకులు తురుముకుంటే

మా ఇంటి గడపకు

నిత్య పచ్చ తోరణం మా నందివర్ధనం.

ఆకాశంలోని చుక్కలనైనా లెక్కించవచ్చుగానీ

మా చెట్టు పూలను లెక్కించటం ఎవరితరం?

రాత్రుళ్ళు అందరికీ ఒకే ఆకాశం అయితే

మాకు రెండు ఆకాశాలు.

మా ఇంటి వాకిలే కాదు

మా మనసుల్లోనూ చలువ పందిళ్ళు వేసింది చెట్టు.

నేనెరుగని

నా కన్నతల్లి

ఇప్పుడు మా ముంగిట్లో పచ్చని చెట్టై వెలసి

ఆకుల కళ్ళతో

నా వొళ్ళంతా తనివి తీరా

నిమురుతున్నట్లే ఉంది.

రోజూ ఇన్ని పూలను

అక్షతలుగా రాల్చి

చల్లచల్లగా దీవిస్తున్నట్లే ఉంది.

పిల్లల చదువుల గురించి

ఇల్లు మారలేకపోతున్నట్టు

ఇప్పుడు మా లోపలికి విస్తరించిన ఈ చెట్టుగురించి కూడా

ఇల్లు మారలేక పోతున్నాం.

ఇప్పుడెవరైనా

మీ ఇల్లెక్కడని అడిగితే

నల్లగేటూ

నందివర్ధనం చెట్టు దగ్గర అని చెప్తాను.

– శిఖామణి

ఇలా అన్నారు

నీలాంబరమే ఇంద్రధనువు మగ్గంపై నేలకోసం చీరనేసెనేమో

చేలూ పూలూ జిలుగుల మెరుపై అద్దకాల అందమిచ్చెనేమో

కోనసీమ తల్లి కులుకే కులుకూ సంకురాత్రి సిరి పలికే వరకూ

పంట పాప ఇంట వెలిగే వెలుగూ భోగిపళ్ళు పోసి మురిసేకళ్ళతో

కరిమబ్బు దీపావళి కరిగివచ్చే ఇల ముందుకే వినిపిస్తోంది చలిజావళి..!

– సిరివెన్నెల